క్లుప్తంగా

పల్లె ప్రకృతి వనాల పరిశీలన



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని గురువారం జెడ్పీ సీఈఓ శోభారాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఏఈ, ప్రత్యేకాధికారి ఎస్.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పద్మారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సంస్థాన్ నారాయణపురం: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షురాలు నిరూప, సావిత్రి, మాధవి, రాణమ్మ, అరుణ, విజయ, పుష్పలత, జ్యోతి, ప్రేమలత, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను గురువారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆవిష్కరించారు. వుప్పల కృష్ణగుప్త, వుప్పల అశోక్‌కుమార్‌గుప్తల ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, కాంసెట్టి చంద్రశేఖర్, ఉబ్బు వెంకటయ్య, కొయ్యడ సైదులు , సుర్వి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్ విద్యార్థులకు గురువారం రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ బీబీనగర్ ఏయిమ్స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మార్చి 3న వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి జ్యోతి కుమార్, బీబీనగర్ ఏయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా, వైద్య బృందం రాహుల్ నరహంగ్, గోవింద్ రావు, కృష్ణ, నీముహజ్, దీపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రం బహూకరణ



ఫాగింగ్ యంత్రాన్ని అందజేస్తున్న బోరెం ప్రకాష్‌రెడ్డి

చౌటుప్పల్ : మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామపంచాయతీకి తాజా మాజీ ఉప సర్పంచ్ బోరెం ప్రకాష్‌రెడ్డి గురువారం ఫాగింగ్ యంత్రాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పృథ్వీరాజ్, మాజీ సర్పంచ్‌లు యాట యోగానందం, బక్క శంకరయ్య, గుండు శ్రీశైలం, మానె రవికుమార్, కొండె స్వామి, దేప మల్లారెడ్డి, బోరెం రవీందర్‌రెడ్డి, రాజు, రామచంద్రం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు: ఆస్తి పన్ను వడ్డీపై ప్రభుత్వం కల్పించిన 90శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలన్నారు. పన్ను బకాయి మొత్తం చెల్లిస్తే వడ్డీపై 90శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో గురువారం మండల కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు చి రందాస్ ధనుంజయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం వెంకటేశం, జిల్లా డైరెక్టర్ వారాల యాదిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమృతం అశోక్, ఉపాధ్యక్షుడిగా వేముల వెంకటేశం, సీత భాస్కర్, ప్రధానకార్యదర్శిగా గుడ్డేటి సుధాకర్, సహాయ కార్యదర్శిగా రుద్ర ప్రభాకర్, కోశాధికారిగా చెరుకు ఆనంద్, గౌరవ సలహాదారుడిగా సోమవరపు లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా చిలువేరు అంజనేయులు, శంకర్, గడ్డం మహేశ్వరీ, బండి రవి, కె. సాంబిరెడ్డిలను ఎన్నుకున్నారు.

నిలువ నీడ కరువు

- బస్టాప్‌ల వద్ద బస్ షెల్టర్లు కరువు
- మండుటెండలో ప్రయాణికులకు తప్పని అవస్థలు
- చెట్ల నీడన, దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి



హన్మకొండవైపు వెళ్లే మార్గంలో బస్సుల కోసం ఎండలో ఎదురు చూస్తున్న మహిళలు



యాదాద్రి వెళ్లే మార్గంలో రోడ్డు వెంట బస్సుల కోసం నిలబడిన ప్రయాణికులు



బ్రిడ్జి కింద బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో నిలువ నీడ కరువైంది. పట్టణంలోని బస్టాప్‌ల వద్ద షెల్టర్లు లేకపోవడంతో రోడ్ల వెంట ఉన్న వృక్షాలను రోడ్డు విస్తరణలో తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. భువనగిరిలో దాదాపు 15 నుంచి 20కి పైగా విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, షా పింగ్ మాల్స్ ఉన్నాయి. వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజు రాయగిరి, కలెక్టరేట్, పాతబస్టాండ్, రైల్వే స్టేషన్ , హైదరాబాద్ చౌరస్తాల వద్ద బస్సులు ఎక్కుతుంటారు. అయితే బస్‌స్టాప్‌ల వద్ద బస్సు షెల్టర్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్లపైనే వారు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపై, కిరాణ దుకాణాల ఎదుట, చెట్ల కింద వేచి చూడాల్సిన దుస్థితి ఉంది. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలబడి ఉన్నా కనీసం తాగడానికి మంచి నీరు సైతం దొరకని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు బస్‌స్టాప్‌ల వద్ద కనీస సదుపాయాలు కల్పించడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బస్‌స్టాప్‌ల వద్ద కనీస వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు నిర్మించాలి



పాతబస్టాండ్, రైల్వే స్టేషన్ ఇతర ప్రాంతంలో రోడ్లపైనే బస్సులకోసం నిలబడాల్సి వస్తుంది. బస్‌స్టాప్‌ల వద్ద కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో బస్‌షెల్టర్లు నిర్మించేందుకు అధికారులు చర్య తీసుకోవాలి.

– భువనగిరి శ్రీనివాస్‌నేత

యాదగిరిగుట్ట మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



యాదగిరిగుట్ట : బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని గురువారం చైర్ పర్సన్ ఎరుకల సుధా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–25 సంవత్సరానికి గాను రూ.16కోట్ల 46లక్షలు బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో 12 వార్డుల అభివృద్ధి కోసం రూ.2కోట్ల 50లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. 2023–24లో మిగులు బడ్జెట్ రూ.18లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. గతేడాది మున్సిపాలిటీ అభివృద్ధి పనుల కోసం రూ.1కోటి 29లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, కౌన్సిలర్లు గౌళికార్ అరుణ, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మీ, గుండ్లపల్లి వాణి, మాలోతు సరోజా, ముక్కెర్ల మల్లేష్, అనిల్, మమతా, నాగరాజు, మౌనిక, పెంటయ్య, సయ్యద్ బాబా, పద్మ, రిజ్వానా, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ



వలిగొండలో ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ చేసి బయటకు వస్తున్న అధికారులు

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల, లోతుకుంట మోడల్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్ రమణి తనిఖీ చేశారు.

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని గురువారం ఇంటర్ బోర్డు స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 341 మందికి గాను ఇద్దరు, ఒకేషనల్‌లో 67 మందికి గాను ఆరుగురు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రభ జస్టిస్ తెలిపారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : మండలంలోని సిరిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్తమార్కండేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం కనులపండువగా నిర్వహించారు. జాల రామ్మూర్తి అర్చకబృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన విగ్రహాలకు జల, ధాన్య, పుష్ప, కనక శయ్యాదివాస పూజలు నిర్వహించి యంత్రస్థాపన చేసి స్వామివార్ల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. శ్రీ భద్రావతీ భావానారుషి శాంతికల్యాణం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్, ఎంపీటీసీ బడుగు రమేష్, తాజా మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, చైర్మన్లు గుండు రాములు, రాపోలు విశ్వనాథం, అప్పం రామేశ్వరం, రాపోలు నర్సింహ, జెల్ల శ్రీనివాస్, పున్న వెంకటేశం, మిర్యాల భాస్కర్, భారత మృత్యుంజయ, రాపోలు రమేష్ పగుడాల సత్తయ్య, అప్పం పెంటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, గుత్తా నర్సింహారెడ్డి, రామిని రమేష్, జెల్ల వెంకటేశం సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, పున్న వెంకటేశం, గంజి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ జోత్స్న

ఆత్మకూరు(ఎం): పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఐసీడీఎస్ మోత్కూరు ప్రాజెక్టు సీడీపీఓ జోత్స్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మాతా శిశు సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలపై తల్లులకు, పిల్లలకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్రాల బలోపేతం కోసం అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌డీఎస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మరియమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

యాదగిరిగుట్ట రూరల్: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ చీర శ్రీశైలం అన్నారు. మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, నమిలె రాంచందర్, సురుపంగ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం

ఆలేరురూరల్ : మండలంలోని మందరపల్లి గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించబడ్డాయని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేంద్రచారి, సత్యనారాయణ, కార్యదర్శి మంహేందర్, మాజీ సర్పంచ్ పాండరి, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, ఉట్కూరి సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని తుర్కలశాపురం గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ యాకన్న, ఎంఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

మోటకొండూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సురేష్, ఆర్ఐ నరేష్, ఎంపీఓ కిషన్, ఏపీఓ అరుణకుమారి, ఏఈఓ రమేష్, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని మొరిపిరాల గ్రామంలో గురువారం పౌర హక్కులను దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ నెలకొన్న సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వై. మల్లిఖార్జున రావు, ఏపీఎం పక్కీరయ్య, పంచాయతీ కార్యదర్శి అంబోజు శంకర్ పాల్గొన్నారు.

మోత్కూరు: పౌర హక్కులను కాపాడాలనిఎంపీడీఓ పోరెడ్డి మనోహర్ రెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ అన్నారు. గురువారం మండలంలోని దాచారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుమన్, ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి శృతి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని తహసీల్దార్ అంజిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అనంతారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట రూరల్: చిన్నకందుకూరులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎంపీపీ



మోత్కూరు: దాచారంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మోటకొండూరు : కొండాపురంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న అధికారులు



ఆత్మకూరు(ఎం): గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం



భువనగిరి రూరల్: సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ అంజిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యాదగిరిగుట్ట రూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ అన్నారు. గురువారం మండలంలోని వంగపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు..ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో పాటుగా, ఉచిత భోజన వసతి, పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేసరి యూత్ అధ్యక్షులు రేగు బాలనర్సయ్య, ప్రధానోపాధ్యాయులు ముత్తయ్య, ఎంపీటీసీ రేపాక మౌనిక, మాజీ సర్పంచ్ కానుగు కవిత బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలకు సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

భువనగిరి రూరల్ : వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్న కూలీలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిప్రదేశంలో కూలీలకు మంచినీరు, నీడ కోసం టెంట్లు వేయాలన్నార. కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ బాలస్వామి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ

రాజాపేట: మండలంలోని జాల గ్రామంలో గురువారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జాల గ్రామానికి చెందిన గుంటి మధుసూదన్‌రెడ్డి, మొగిలి వెంకటయ్య వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



రాజాపేట : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాపేట : మండలంలోని కుర్రారం ఉన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా.. ఉపాధ్యాయులుగా..ప్రజాప్రతినిధులుగా.. వ్యవహరించి అలరించారు. ప్రధానోపాధ్యాయుడిగా ఎర్రగుంట ఐశ్వర్య, ఎంఈఓగా స్పందన, ఎంపీడీఓగా మహేందర్, ఎంఆర్ఓగా భవ్య, డీఈఓ సుప్రీత, ఆర్డీఓగా శివప్రసాద్, కలెక్టర్‌గా నందహర్షిని, ఎమ్మెల్యేగా భాను, విద్యాశాఖ మంత్రిగా ఐశ్వర్యలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బీ పరమేష్, ఉపాధ్యాయులు కరుణ, రాజు, లక్ష్మిసామ్రాజ్యం, సుజాత, కళ్యాణి, వెంకటేశ్ పాల్గొన్నారు.



మోత్కూరు : ప్రాథమిక పాఠశాలలో..

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు అరుణాదేవి, లలిత, సౌజన్య, జ్యోతి, రజిత, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా ఎంపిక



హరికృష్ణ

వలిగొండ : రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన గురుకులాల డిగ్రీ లెక్చరర్ల ఫలితాల్లో మండలంలోని (ఎం) తుర్కపల్లికి చెందిన మాసంపల్లి హరికృష్ణ ఎంపికయ్యాడు. ఆయన ఎంపిక పట్ల బంధుమిత్రులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు



నరేష్

మోత్కూరు: మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన మాతంగి నరేష్ గురువారం ప్రకటించిన గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 2018లో గురుకుల టీజీటీగా ఉద్యోగం సాధించిన నరేష్ ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమై ఇప్పుడు రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు.

నేడు కల్యాణ మహోత్సవం

భువనగిరి రూరల్ : మండలంలోని నమాత్‌పల్లి గ్రా మంలోని స్వయంబు పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వా మి ఆలయంలో శుక్రవారం స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అతికం లక్ష్మీనారాయణ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ బదిలీ

చౌటుప్పల్ : చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ సైదులును బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా ఎవరిని నియమించలేదు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

మర్రిగూడ: గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.రంగారెడ్డి అన్నారు. గురువారం మర్రిగూడ మండలంలోని వట్టిపల్లిలో పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన తుప్పరి యాదగిరిపై ఎక్సైజ్ శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిపాల్ రెడ్డి

గుండాల: మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో నల్లగొండ కేంద్ర సహకార బ్యాంక్ మోత్కూరు శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కూరు బ్రాంచ్ మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీసీసీబీ రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ఎలాంటి ఓటీపీలు ఇతరులకు చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జంపాల కొమురయ్య, మాజీ ఎంపీపీ హరితాదేవి, సిబ్బంది సుందర్, నాగయ్య, హన్మంతు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న మాయ దశరథ

భువనగిరి : బీజేపీపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల విషయంలో బీజేపీ ఏ పార్టీతో పొత్తుగానీ.. ఒప్పందం గానీ చేసుకోలేదన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కోసం ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లతోనే పోటీ చేశామన్నారు. అందరి సమక్షంలోనే జరిగిన ఈ ఎన్నికలపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ పై అవిశ్వాసం పెట్టిందే బీఆర్ఎస్ కౌన్సిలర్లన్నారు. బీఆర్ఎస్ పార్టీ మునిగి పోయే నావాలంటిదని విమర్శించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చందా మహేందర్ గుప్తా, పడమటి జన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ రత్నపురం బలరాం,జనగాం కవితా నర్సింహ చారి , ఉదయగిరి విజయకుమార్, భాస్కర్, రాజేష్, మణికంఠ, వైజయంతి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరం శివారులోని మూసీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

లోకాయుక్తకు ఫిర్యాదు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన మక్కల దుర్గయ్య గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా డీపీఓ సునంద, యాదగిరిగుట్ట ఎంపీఓ చంద్రశేఖర్ పై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని రెవెన్యూ సర్వే నెంబర్ 158/ఏ/2 లో ఉన్న బోరు బావి ప్రభుత్వ భూమిలో ఉందని ఎలాంటి ఆధారాలు లేకుండా మాకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



మనీషా

వలిగొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారి అశోక్ చిన్న కుమార్తె మనీషాకు 2020వ సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్‌మెట్ మండలం మసీదుగూడెం గ్రామానికి చెందిన గుత్తా శ్రీశైలంతో వివాహమైంది. పెళ్లైన ఆరు నెలలకే మనీషా తన భర్త నుంచి విడాకులు తీసుకొని గోకారంలో తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. కాగా ఈ నెల 23వ తేదీన సూర్యాపేటలో ఉంటున్న తన బంధువుల ఇంటికి వెళ్తున్నా అని బయల్దేరిన మనీషా ఆ తర్వాత కనిపించకుండాపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం రాత్రి వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ గురువారం తెలిపారు.